క్లుప్తంగా

చలో ఢిల్లీ కరపత్రాల విడుదల



మానవపాడు: పార్లమెంట్ సమావేశలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్‌పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బల్గెర్ హుస్సేన్ చల్లో ఢిల్లీ కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్రంలో బీజేపి ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మల్లెపోగు లక్ష్మణ్, మానవపాడు మండల అధ్యక్షుడు నరేష్, భాస్కర్, శివ, శ్యాంరాజ్, అనిల్ పాల్గొన్నారు.

మరమ్మతు చేపట్టండి



అయిజ: గట్టు మండలం బోయలగూడెం నుంచి అయిజ మండలంలోని సింధనూరుకు ఏర్పాటు చేసిన వాటర్ గ్రిడ్ పైప్‌లైన్ సింధనూరు శివారువద్ద లీకేజీ అయ్యింది. రెండు సంవత్సరాలుగా పైప్‌లైన్ లీకవుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. అనేక సార్లు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నా మళ్లీమళ్లీ లీకవుతోంది. మరమ్మతు చేసిన బిల్లులు చెల్లించడంలేదని సిబ్బంది వాపోతున్నారు.

హైమాక్ట్ లైట్లు ఏర్పాటు చేయండి

మానవపాడు: జాతీయ రహదారి–44పై హైమాక్ట్ లైట్లు లేక రాత్రి సమయంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. రోడ్డు దాటడంలోనూ ఎన్నో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయారు. నిత్యం వాహనాలు ప్రయాణిస్తుంటాయి. మండల కేంద్రం మానవపాడు నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి ఉంది. ఇక్కడి నుంచి ప్రయాణికులు, వాహనదారులు, ఉద్యోగులు నిత్యం వివిధ ప్రాంతాల నుంచి మండల కేంద్రానికి చేరుకుంటారు. రోడ్డు దాటే క్రమంలో రాత్రి సమయంలో ఇబ్బందులు ఎదురౌతున్నాయని మండల ప్రజలు వాపోతున్నారు. చాలా సార్లు హైవే అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి హైమాక్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాసిరకం మట్టితో అప్రోచ్ రోడ్డు



అయిజ: మండల కేంద్రంలో పాతబస్టాండ్–కొత్త బస్టాండ్ మధ్య పెద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభించారు. నాసిరకం మట్టితో రోడ్డు నిర్మిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి నిర్మించేందుకు వాగులో తవ్విన మట్టిని ఇప్పుడు అప్రోచ్ రోడ్డుకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. దానివల్ల వాగుకు వరద వచ్చిన సమయంలో మట్టి కొట్టుకపోయి బ్రిడ్జి పడిపోయే అవకాశం ఉందని పలువురు ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంపై ఆర్ అండ్ బీ ఏఈ మహేష్‌ను వివరణ కోరగా అప్రోచ్ రోడ్డు నిర్మించేందుకు నాణ్యమైన మట్టిని ఉపయోగించాలని, ఇప్పుడు మనుషులు నడిచేందుకు తాత్కాలికంగా మట్టిని వేస్తున్నారని పేర్కొన్నారు.

ఒకటో తేదీనే పింఛన్ ఇవ్వాలి



గద్వాల అర్బన్: రిటైర్డ్ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్ ఇవ్వాలని ఆ సంఘం కార్యదర్శి చక్రధర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఐటీ నుంచి ఉపశమనం కల్పించాలని, ఆరోగ్యశ్రీ కార్డులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు పెన్షనర్ల ఉద్యమ పితామహుడు డీఎస్ నకార చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళులర్పించారు. అదేవిధంగా 70ఏళ్లు పైబడిన రిటైర్డ్ ఉద్యోగులకు పూలమాల, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోశాధికారి బీసీ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు, పండరినాథ్, కృష్ణారెడ్డి, వెంకటరమణ, వసంతరాముడు ఉన్నారు.

రహదారులకు మరమ్మతులేవి?

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఎల్కూర్–మల్దకల్ గ్రామాల మధ్య గుంతల మయంగా రోడ్డు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై గుంతలు ఏర్పడటంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. మల్దకల్–మద్దెలబండ, సద్దలోనిపల్లి– నేతువానిపల్లి, తాటికుంట–తప్పెట్లమొర్సు, ఎల్కూరు–మల్దకల్, నాగర్‌దొడ్డి స్టేజీ –తూంకుంట గ్రామాల మధ్యన ఉన్న బీటీ రహదారులపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ రహదారులపై భారీ వాహనాలతో పాటు వర్షాలకు రోడ్లు అక్కడక్కడ దెబ్బతినడంతో గుంతలు ఏర్పడ్డాయి. రాత్రివేళల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇటీవల రోడ్డుకు అటు ఇటు పొలాలు ఉన్న రైతులు రోడ్డును అడ్డంగా తవ్వి పైపులైన్‌ను ఏర్పాటు చేసుకోవడంతో మరింత గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు పేర్కొంటున్నారు. రోడ్లను తవ్విన వారిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులుచూసిచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఇష్టానుసారంగా రోడ్లను తవ్వేస్తున్నారని వాహనదారులుఆరోపిస్తున్నారు. రోడ్లను మరమ్మతు చేయాల్సిన అధికారులు వాటిపై తాత్కాలికంగా అక్కడక్కడ మట్టిని వేసి చేతులు ఎత్తేస్తున్నారు. గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మతు చేపట్టి ప్రమాదాలను నివారించాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. రోడ్లపై ఉన్న మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్లను ఏర్పాటు చేసిన సమయంలో సూచికబోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు మలుపుల వద్ద ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టి, మలుపుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



సద్దలోనిపల్లి నుంచి నేతువానిపల్లి వరకు బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడడంతో ప్రమాదాలవుతున్నాయి. అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు దృష్టి సారించి రోడ్డుకు మరమ్మతులు చేయించి ప్రమాదాల బారి నుంచి వాహనదారులను కాపాడాలన్నారు.

– వెంకటేష్, సద్దలోనిపల్లి

సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి



మండలంలోని వివిధ గ్రామాలకు ఉన్న బీటీ రహదారులపై ఉన్న మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు సూచిక బోర్డులను ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– రాముడు, నాగర్‌దొడ్డి

చర్యలు తీసుకుంటాం



మండలంలోని వివిధ గ్రామాలకు ఏర్పాటు చేసిన బీటీ రహదారులపై గుంతలు ఏర్పడిన విషయాన్ని పరిశీలించి నివేదికలు ఉన్నతాధికారులకు పంపించాం. మరమ్మతులకు నిధులు మంజూరు కాకపోవడంతో కొంత ఆలస్యం అవుతోంది. నిధులు మంజూరైన వెంటనే గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మతు చేపడతాం.

– భరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేతల కప్‌లను పరిశీలిస్తున్న నాయకులు

ధరూరు: క్రీడలు శారీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్నిస్తాయని మండల జడ్పీటీసీ సభ్యురాలు పద్మావెంకటేశ్వరరెడ్డి అన్నారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని కీ.శే. గాండ్ల వీరప్ప స్టేడియంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఆమె ప్రారంభించారు. ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో మెలగాలన్నారు. గ్రామీణ క్రీడలు తమలో దాగి ఉన్న ప్రతిభను బ యటపెట్టేందుకు దోహదం చేస్తాయన్నారు. క్రీడల ద్వారా తల్లిదండ్రులు, గ్రామం, జిల్లాకు పేరు తీ సుకొచ్చే విధంగా ఉండాలన్నారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకోవడంతో పాటు బ్యా టింగ్ చేసి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో బండ్ల వెంకటేశ్వరరెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు బండ్ల వెంకటేశ్వరరెడ్డి, జాంపల్లి వెంకటేశ్వరరెడ్డి, శ్రీహర్ష, కురువ శ్రీను, పురుషోత్తంరెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

స్త్రీల ప్రత్యేక ఆరాధన కార్యక్రమం



ఎంబీ చర్చిలో పాటలు పాడుతున్న పాస్టరమ్మ

ధరూరు: ఆస్తులు, అంతస్తులు కాకుండా ప్రతి ఒక్క స్త్రీ కుటుంబాన్ని కట్టే స్త్రీగా జీవించాలి పాస్టరమ్మ మరియమ్మప్రసాద్ తెలిపారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని ఆదివారం మండల కేంద్రంలోని ఎంబీ షాలేం చర్చిలో స్త్రీల ప్రత్యేక ఆదివారం ఆరాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సంఘ స్త్రీలనుద్దేశించి వాక్యోపదేశం చేశారు. నువ్వొక ప్రత్యేకమైన నక్షత్రంగా ఉండాలని అన్నారు. క్రిస్మస్ అంటే పిండి వంటలు, కొత్త బట్టలే కాదని హృదయాన్ని శుద్ధి చేసుకోవడం అతి ప్రాముఖ్యమైనదన్నారు. ధన్యురాలిగా పిలవబడాలన్నారు. అలనాడు మరియ చేసిన సత్క్రియలు మనం చేయాలని సూచించారు. గుణవతియైన భార్య దొరుకుట అరుదు, అది ముత్యం కంటే శ్రేష్టం అని బైబిల్ ఆధారంగా ప్రవచనాలు వివరించారు. సంఘంలో స్త్రీ పాత్రపై వివరించారు. అనంతరం స్త్రీల కమిటీ వారితో కలిసి కేక్‌కట్ చేసి సంబరం చేసుకున్నారు. కార్యక్రమంలో స్త్రీల సంఘం పెద్దలు పాల్గొన్నారు.

భద్రతలేని ప్రయాణం.. ప్రమాదం



అయిజ నుంచి కూలీలను తరలిస్తున్న వాహనం



కర్ణాటక నుంచి కూలీలను తరలిస్తున్న ఆటో

మల్దకల్: కొందరు ప్రైవేట్ వాహన డ్రైవర్లు, ప్రయాణికులు నిర్లక్ష్యం వీడడంలేదు. కూలీలు ప్రైవేటు వాహనదారులను ఆశ్రయించడంతో వారు పరిమితికి మించి ప్రయాణికులను చేరవేస్తూ వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కర్ణాటకలోని వివిధ గ్రామాలకు చెందిన కూలీలతో పాటు గద్వాల, ధరూరు, గట్టు ప్రాంతాల నుంచి గూడ్సు వాహనాలతో పాటు ప్యాసింజర్ వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు. 7మంది ఎక్కాల్సిన ఆటోలో 12నుంచి 15మంది ప్రయాణికులను చేరవేస్తున్నారు. చిన్నపాటి ప్రమాదాలు జరిగినా భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు

గూడ్సు వాహనాల్లో ప్రయాణికులను చేరవేసి నిబంధనలను ఉల్లంఘించే వారిపై కేసులు నమోదు చేస్తాం. డ్రైవర్ల లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు వారిపై కేసులు నమోదు చేస్తాం.

– ఈశ్వరయ్య, ఏఎస్ఐ, మల్దకల్

వ్యసనాలతో భవిత ప్రశ్నార్థకం

- మద్యానికి బానిసవుతున్న యువత
- రోడ్డు ప్రమాదాల్లో జీవితాలను కోల్పోతున్న వైనం
- తల్లిదండ్రులకు తీరని శోకం



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కేటీదొడ్డి: యువతంటే మార్పును ఆశించే కొత్తతరం. అవకాశాలను అందిపుచ్చుకొని భవితకు బాటలు వేసుకునే నవశక్తి తలుచుకుంటే ఎదైనా సాధించే ఆత్మవిశ్వాసం వారి సొంతం. కొందరు చెడు వ్యసనాలకు బానిసై పెడదోవపడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. భవితను ప్రశ్నార్థకంగా మార్చుకుంటున్నారు. మద్యం, పొగతాగడం వంటిదుర వాట్లకు బానిసవుతున్నారు. దీంతో చిన్న వయస్సులోనే రోగాల పాలవుతున్నారు. వారిని రక్షించుకునేందుకు తల్లిదండ్రులు నానాపాట్లు పడుతున్నారు.

మద్యానికి బానిసై..

మండలంలోని కేటీదొడ్డి, గ్రామానికి చెందిన, యువకులు ఇటీవల మద్యం తాగి వాహనం నడపడంతో అదుపుతప్పి కిందపడి ఆస్పత్రిపాలయ్యాడు. పాతపాలెం గ్రామానికి చెందిన మరో యువకుడు బైక్ నుంచి పడి ప్రాణాలు పోగొట్టుకుని వారి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చాడు. వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బాగా చదువుకుని ప్రయోజకులై కన్నవారి కలలు నెరవేరుస్తారనుకుంటే వారికే భారమవుతున్నారు. పోలీసులు స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువకుల్లో పరివర్తన తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ యువకులకు అవగాహన కల్పిస్తున్నాం. తాగి వాహనం నడిపే ముందు భార్య, పి ల్లలు తల్లిదండ్రులను గుర్తుచేసుకోవాలని చెబుతున్నాం. తాగి వాహనం నడపటం వల్ల ప్రమాదాలకు గురైతే కుటుంబం వీధిన పడుతుందని అవగాహన కల్పిస్తున్నాం. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.

– వెంకటేష్, ఎస్ఐ, కేటీదొడ్డి

త్రైత సిద్ధాంత భగద్గీత ప్రచారం



అయిజ: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక బింగుదొడ్డి సభ్యులు మండలంలోని కేశవరంలో ఆదివారం త్రైత సిద్ధాంత అనుబంధ గ్రంథాలను ప్రజలకు అందజేసి భగవద్గీత గురించి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బింగుదొడ్డి కమి టీ అధ్యక్షుడు లక్ష్మణ్ మాట్లాడుతూ త్రైతసిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్యలో ఉన్న అసమానతలను తొలగించడానికి, సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో బింగుదొడ్డి కమిటీ సభ్యులు ఈరన్న, వెంకటేష్, రామచంద్ర, జయమ్మ, నరసమ్మ, పద్మమ్మ, జములమ్మ పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి చేస్తా..

ధరూరు: గ్రామాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని అల్వలపాడు గ్రామ సర్పంచ్ వీరన్న గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన గ్రామ పంచాయతీ, పల్లె దవాఖాన, రైతు వేదికలకు టీ ఫైబర్ కనెక్షన్ ఇవ్వనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడారు. గ్రామానికి వచ్చిన వనరులను సద్వినియోగం చేసుకోవడతో పాటు వాటిని నాణ్యతగా ఏర్పాటు చేయాలన్నారు. అందుకు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



గద్వాల అర్బన్: జిల్లా వాల్మీకి బోయ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కృష్ణయ్య, అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యాక్షులు విష్ణు, చిన్న నర్సింహులు, కృష్ణ, సురేష్, నర్సమ్మ, ప్రధాన కార్యదర్శిగా మేడికొండ ఈశ్వర్, ఉపకార్యదర్శులు వినోద్‌కుమార్, తిమ్మప్ప, నర్సింహ్మా, కోశాధికారి అశోక్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం వాల్మీకి బోయల సమస్యలు పరిష్కారానికి తమవంతు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

అసంపూర్తి పనులు పూర్తిచేయండి

శాంతినగర్: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా తవ్విన ప్రధాన కాల్వల అసంపూర్తి పనులు వెంటనే పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నెట్టెంపాడు 99, 100 ప్యాకేజీల్లో వందల ఎకరాల సాగు భూములు కోల్పోయామని, పదేళ్లు గడుస్తున్నా అటు కాల్వలకు నీరురాక, ఇటు పంటలు పండించుకోలేక నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. దాదాపు 80 శాతం పనులు పూర్తిచేశారని, మరో 20 శాతం పనులు త్వరితగతిన పూర్తిచేసి వచ్చే వానాకాలం నాటికి కాల్వల్లో నీరు పారుదల అయ్యేలా చూడాలని అయిజ, వడ్డేపల్లి, ఇటిక్యాల మండలాల రైతులు కోరుతున్నారు. గతంలో తవ్వి వదిలేసిన కాల్వల్లో భారీ వృక్షాలు, ముళ్లపొదలు దట్టంగా ఉన్నాయని వాటిని తొలగించి, పొలాలకు వెళ్లే దారుల్లో అక్కడక్కడ కల్వర్టులు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని నీటి పారుదలశాఖ అధికారులు,రైతులు కోరుతున్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గద్వాల అర్బన్: గద్వాల మండలంలోని పూడూరులో వీరభద్రస్వామి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయంలో వీరభద్రేశ్వర స్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 12:12గంటలకు వేద మంత్రోచ్ఛరణల మధ్య అమ్మవారి మెడలో మాంగళ్యధారణ నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని ఆలయ ధర్మకర్తలు రాజవంశస్తులు డాక్టర్ విక్రమసింహారెడ్డి, డాక్టర్ సుహాసినిరెడ్డి దంపతుల చేతులమీదుగా ఘనంగా నిర్వహించారు. అనంతరం కల్యాణ జయంతి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో వశంపారంపరం ధర్మకర్తలు ఉషారాణి, చెన్నకేశవరెడ్డి, సర్పంచు శశికళ లక్ష్మి, కాంతారెడ్డి దంపతులు, మాజీ సర్పంచ్ అచ్చన్నగౌడ్ దంపతులు పాల్గొన్నారు. సోమవారం రంగోత్సవం, నందికోల సేవ, పల్లకీ సేవ, నాగవల్లి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

మిరప సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీవారు

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని ఆర్.గార్లపాడులో ఆదివారం కనకదార సీడ్స్ కంపెనీ ఆధ్వర్యంలో మిరప పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన రైతు శేషిపాణిశెట్టి సాగు చేసిన కనకదార కంపెనీకి చెందిన కెడిఎస్–9043 రకం మిరప పంటను స్థానిక రైతులతో కలిసి కంపెనీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ జయప్రసాద్ మాట్లాడుతూ కెడిఎస్–9043 రకం వివిధ తెగుళ్లను తట్టుకుంటుందన్నారు. ఎలాంటి వాతావరణ పరిస్థితులైనా తట్టుకొని అధిక దిగు బడిని అందిస్తుందన్నారు. ఒక ఎకరానికి సరాసరి దిగుబడి 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు వస్తుందన్నారు. రైతులు కనకదార కంపెనీకి చెందిన మిరప విత్తనాలను నాటుకొని అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు. అనంతరం రైతుకు పూలమాలల వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కంపెనీ ఏఎస్ఎం నరసింహులు, అధీకృత డీలర్, భాస్కర్, ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.

కర్రసాము శిక్షణ తరగతులు ప్రారంభం



కర్రసాము శిక్షణ ఇస్తున్న మాస్టర్ శ్రీహరి

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో మొట్టమొదటి సారిగా కర్రసాము శిక్షణ తరగతులు నిర్వహించారు. తైక్వాండో కరాటే మాస్టర్ శ్రీహరి ఆధ్వర్యంలో కర్రసాము ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరి తమిళనాడుకు చెందిన శ్రీనివాసులు సారథ్యంలో జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్ ఆవరణలో ఆదివారం కర్రసాము శిక్షణ తరగతులను ప్రారంభించారు. 150మంది విద్యార్థులకు కర్రసాము శిక్షణలో మెళకువలు నేర్పుతున్నారు. ఈ శిక్షణ తరగతులు సోమవారం కూడా కొనసాగునున్నట్లు మాస్టర్ శ్రీహరి తెలిపారు. రాబోయే రోజుల్లో విద్యార్థులకు తైక్వాండో కరాటేలో శిక్షణ మాదిరిగానే కర్రసాము శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మౌనిక, శ్రీనివాస్‌శెట్టి, రంగస్వామి, రామేశ్వరి ఉన్నారు.

జీపీ వర్కర్లకు వేతనాలు పెంచాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

గద్వాల అర్బన్: గ్రామ పంచాయతీ వర్కర్లకు వేతనాలు పెంచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు హనుమంతు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీ కార్మికులు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు వసతులు కల్పించాలని, రూ.10లక్షల బీమా పథకం, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, తదితర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జమ్మిచేడు కార్తీక్, నాయకులు చంద్రరాములు, తిమ్మప్ప, పరుశరాముడు, బీచుపల్లి, శివయ్య, భీమన్న ఉన్నారు.

కంకర కష్టాలు తప్పేదెన్నడో?



పుల్లూరు–కలుగోట్ల మధ్యలో కంకర రోడ్డు

ఉండవెల్లి: కంకర రోడ్డుపై ప్రయాణం కష్టాలు తప్పేదెన్నడో.. అని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటీ తొలగించి నాలుగు నెలలు గడిచినా పూర్తి చేయకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతుందని వాపోతున్నారు. మండలంలోని పుల్లూరు నుంచి కలుగోట్ల మీదుగా వయా మెన్నిపాడు వరకు 3 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా నెలల కిందట బీటీని పూర్తిగా తొగించారు. వెంటనే కంకరపోసి వదిలేశారు. నెల రోజుల్లో మళ్లీ బీటీ వేస్తారని జనం ఆశించినా.. నాలుగు నెలలు గడిచినా పని పూర్తి చేయలేదు. రెండు గ్రామాల రైతులు, ప్రజలు వ్యవసాయ, ఇతర పనులకు ప్రతిరోజూ ఈ దారి మీదుగా వెళ్లేందుకు జంకుతున్నారు. సుమారు వంద మందికిపైగా ప్రతిరోజూ పాడి గేదలు, గొర్రెలు, మేకలు, కాడెద్దుళ్లతో వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి వస్తారు. కంకరతో పశువుల గిట్టలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు కుంట నుంచి పుల్లూరు, కలుగోట్ల మీదుగా వెళ్తున్నారు. రోడ్డుపై వాహనాలు తిరుగుతుంటే దుమ్ము ఎక్కువగా వస్తుంది. ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డు కష్టాలు తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వెళ్లాలంటేనే భయంగా ఉంది..

మా వ్యవసాయ భూములకు ప్రతిరోజూ ఈ కంకర రోడ్డు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. కంకరతో ఎడ్లు, గేదలు కూడా నడవలేకపోతన్నాయి. ఈ దారిలోకి రావాలంటే పశువులు పారిపోతున్నాయి. త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి.

– జితేందర్, మెన్నిపాడు

ఖాళీ అవుతున్న సర్కార్ బడులు



మూతపడిన మంగాళపల్లి ప్రాథమిక పాఠశాల

పాన్‌గల్: తొలిమెట్టు, బడిబాట వంటి ఎన్ని కార్యక్రమాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గిపోతూ మూతపడుతున్నాయి. ఉన్న ఊరిలోనే చిన్నారులను ఓనమాలు దిద్దించి.. విద్యాబుద్ధులు నేర్పించి పైచదువులకు వెళ్లేలా తీర్చిదిద్దే పల్లె బడులు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ప్రైవేట్ వైపు మొగ్గు చూపుతున్న తల్లిదండ్రులను ఒప్పించి వారి పిల్లలను సర్కారు పాఠశాలల్లో చేర్పించడంలో విద్యాశాఖ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా మండలంలో ప్రతి సంవత్సరం మూసి వేస్తున్న పాఠశాలల సంఖ్య పెరుగుతూ వస్తోంది. మండలంలో మూత పడుతున్న పాఠశాలల వివరాలు.. కిష్టాపూర్, దవాజిపల్లితండా, మంగళ్లపల్లి(నిజామాబాద్) రేమద్దుల బీసీ కాలనీ, గన్యానాయక్‌తండా, గురిగింజమిట్టా తండా ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. దీంతో పాటు మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పదిలోపు ఉన్నాయి. అవి కూడా మూతపడే ప్రమాదం ఉందని ఇప్పటికైన విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.